నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, బుధవారం 12 మార్చి 2025 | HYDERABAD

ఎస్.ఆర్.నగర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకట రమణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి

రోడ్డు ప్రమాదంలో మరణించిన ముసారాంబాగ్ మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి కుమారుడి కనిష్కరెడ్డి సంతాప సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా కనిష్కరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. కనిష్క రెడ్డి తల్లిదండ్రులు అజిత్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సునరితా రెడ్డిని ఓదార్చారు. మాజీ మంత్రి కేటీఆర్ వెంట మాజీ ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు ఉన్నారు.
- మన్సూరాబాద్, మార్చి 11

కాంగ్రెస్ ఆశలు గల్లంతు!

16 నెలలుగా మంత్రివర్గంలో ప్రాతినిధ్యం దొరకని గ్రేటర్

- నిన్నటిదాకా ఎమ్మెల్సీ టు క్యాబినెట్ ఆశల్లో ఉన్న నేతలు
- తెరపైకి అంజన్, మధుయాష్కీ, ఫిరోజ్‌ఖాన్, దానం, అజారుద్దీన్ పేర్లు చక్కర్లు
- అధిష్ఠానం కరుణించకపోవడంతో తీవ్ర నిరాశలో ఆశావహులు

సిటీబ్యూరో, మార్చి 11 (నమస్తే తెలంగాణ): ఒక్క దెబ్బకు రెండు పిట్టలు! నిన్నటిదాకా గ్రేటర్ కాంగ్రెస్ నేతల గురి ఇట్లనే ఉండె. ఎమ్మెల్సీ టు క్యాబినెట్ దిశగా.. పైకి ఎమ్మెల్సీ ప్రయత్నాలైనా.. ఆ కొమ్మ పట్టుకొని మంత్రివర్గం దాకా ఎక్కాలని తెగ పోరాడారు. ఎవరిస్థాయిలో వాళ్లు అన్ని అస్త్రాలూ సంధించారు. అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు అందివచ్చిన దారులన్నింటినీ వినియోగించారు. కొందరు బహిరంగ వేదికలపై 'ఎమ్మెల్సీ టు క్యాబినెట్' ఆకాంక్షను తమకు తోచిన కోణంలో వ్యక్తం చేశారు. కానీ వారి ఆశలు గల్లంతయ్యాయి. పార్టీ అధిష్ఠానం రెండ్రోజుల కిందట ఇచ్చిన ఎమ్మెల్సీల జాబితాలో అసలు గ్రేటర్‌కు స్థానమే దక్కకపోవడంతో 'అయినా... అనుకున్నవన్నీ జరుగుతయా?' అని నిట్టూరుస్తున్నారు. మరి.. ఇంత జరిగినా ఎవరూ గళం మాత్రం విప్పడం లేదు. కారణం... 'నాకు దక్కకున్నా సరే.. గ్రేటర్‌లోని ఇతర ఆశావహులకైతే దక్కలేదు చాలు...' అనుకుంటున్నారు. హమ్మయ్య... ఇప్పటికైతే మంత్రివర్గంలో గ్రేటర్ బెర్త్ ఖాళీనే! మరో అవకాశం రాకపోదా!! అని తమకు తాము సర్ది చెప్పుకుంటున్నారు.

కాంగ్రెస్ వచ్చింది.. గ్రేటర్ ప్రాతినిధ్యం పోయింది..!

ఎలాగైనా ఎమ్మెల్సీ దక్కించుకుని మంత్రివర్గంలో బెర్త్ ఖరారు చేసుకోవాలని ఆశపడిన గ్రేటర్ ఆశావహులకు నిరాశే మిగిలింది. ఎమ్మెల్యేల కోటాలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్ వచ్చింది మొదలు.. గ్రేటర్‌లోని పలువురు నేతలు జాబితాలో చోటు దక్కించుకునేందుకు చేయని ప్రయత్నమంటూ లేదు. ముఖ్యంగా రాష్ట్ర మంత్రివర్గంలో ఇప్పటిదాకా గ్రేటర్ ప్రాతినిధ్యం లేకుండా పోయింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆ పార్టీకి ఒక్క స్థానం కూడా దక్కలేదు. ఆపై కంటోన్మెంట్‌కు వచ్చిన ఉప ఎన్నికలో శ్రీగణేశ్‌ను విజయం వరించింది. కానీ ఆయన అప్పటికప్పుడు బీజేపీ నుంచి వచ్చి టికెట్ దక్కించుకున్న ప్యారాచూట్ నేతనే. దీంతో మంత్రివర్గంలో గ్రేటర్ ప్రాతినిధ్యం మార్గం సుగమం కానట్లేనని పార్టీ నేతలే కుండబద్దలు కొడుతున్నారు. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదలు గత పదేండ్ల బీఆర్ఎస్ హయాంలోనూ రాష్ట్ర మంత్రివర్గంలో గ్రేటర్ ప్రాతినిధ్యానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. కేసీఆర్ ప్రభుత్వంలోని మంత్రివర్గంలో తొలి దఫా ఇద్దరు... రెండో దఫాలో ఏకంగా ముగ్గురికి ప్రాతినిధ్యం కల్పించారు. అలాంటిది కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత క్యాబినెట్‌లో గ్రేటర్ ప్రాతినిధ్యమే లేకుండా పోవడాన్ని పార్టీవర్గాలే పెద్ద లోటుగా భావిస్తున్నాయి.

ఒక్కొక్కరిది ఒక్కో వ్యథ!

గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి ప్రాతినిధ్యం దక్కకపోవడంతో మంత్రివర్గంలోనూ ప్రాతినిధ్యం లేకుండా పోయింది. ఈ క్రమంలో ప్రజాక్షేత్రంలో విజయం వెక్కిరించినా.. కనీసం అధిష్ఠానం కనికరిస్తే వయా ఎమ్మెల్సీ మంత్రివర్గంలో చోటు దక్కించుకుని బుగ్గకారులో తిరగాలని పలువురు నేతలు తెగ కలలు కన్నారు. ఇందులో భాగంగా ఇటీవల వచ్చిన ఐదు ఎమ్మెల్సీ స్థానాల నోటిఫికేషన్‌తో వాళ్ల కలలకు రెక్కలొచ్చినట్లయ్యాయి. అందుకే అనేక రకాలుగా అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించారు.

☞ ఎల్బీనగర్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ ఈ జాబితాలో ముందు వరుసలోనే ఉన్నారు. ఇక్కడి 'ముఖ్య'నేతతో అంతగా సత్సంబంధాలు లేకున్నా హస్తిన నుంచి నరుక్కు వచ్చే అనుభవం, సామర్థ్యం ఆయనకుంది. ఈ క్రమంలో ఎల్బీనగర్ గ్రేటర్ పరిధిలోకి వస్తున్నందున ఎమ్మెల్సీగా 'ఒక్క ఛాన్సు' ఇస్తే ఇట్టే మంత్రివర్గంలో బెర్త్ ఖరారు చేసుకోవచ్చని ఆశించారు. కానీ ఏకంగా రాహుల్ గాంధీతో ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశం వచ్చినప్పటికీ జాబితాలో మాత్రం అదృష్టం వరించలేదు.

☞ మాజీ ఎంపీ, పార్టీ సీనియర్ నేత అంజన్‌కుమార్ యాదవ్.. మనసులోని కోరికను ఎప్పుడూ దాచుకున్న దాఖలాలు లేవు. తనయుడికి చిన్న వయసులోనే రాజ్యసభ భాగ్యం కలిగినప్పటికీ... తనలోని మంత్రివర్గ కోరిక మాత్రం కుదురుగా ఉండనీయడం లేదు. అందుకే తనయుడు అనిల్‌కుమార్‌కు ఎంపీ అవకాశం ఇచ్చినా సరే! తన కోటా తనదేనంటున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్ రాకముందే బహిరంగంగానే తన మనసులోని మాటను అనేకసార్లు వెల్లడించడమే కాకుండా గతంలో తనకొచ్చిన అవకాశాలు ఎలా వచ్చాయి... గడపదాకా వచ్చిన అవకాశాలను ఎవరు కొల్లగొట్టారనేది కూడా ఏకరువు పెట్టారు. ఒక దశలో ఒక సామాజిక వర్గాన్ని సైతం లక్ష్యంగా ఎంచుకున్నారు. ఎందుకంటే ఎమ్మెల్సీ అవకాశాల్లో వాళ్లేమైనా మోకాలడ్డుతారేమోనని పరోక్షంగా హెచ్చరించారు. కానీ అధిష్ఠానం మనసులో సమీకరణాలన్నీ వేరేవిధంగా ఉండటంతో అంజన్‌కుమార్ పాచిక పారలేదు.

☞ మైనార్టీ కోటాలో తమకు అవకాశం దక్కకపోతుందా.. అని ఎదురుచూసిన గ్రేటర్‌లోని ఇద్దరు కీలక మైనార్టీ నేతలకూ ఈసారి ఆశాభంగమే కలిగింది. నాంపల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలైన ఫిరోజ్‌ఖాన్‌కు ఎమ్మెల్సీ టు క్యాబినెట్ ఆశలు ఎంత ఉన్నాయో... మజ్లిస్ రూపంలో ఆ ఆశలకు గండిపడటం ఖాయమనే స్పష్టత కూడా ఉందని ఆ పార్టీకి చెందిన కొందరు నేతలు చెబుతారు. అందుకే అడగనిదే అమ్మయినా పెట్టదన్నట్లు! అడిగితే పోయేదేముంది అనే ప్రయత్నాలేగానీ వంద శాతం సక్సెస్ రేటు ఉండదనేది కూడా ఆయనకు తెలుసని సన్నిహితులే అంటుంటారు.

☞ మౌనంగా బంతి విసరడంలో అజారుద్దీన్ సిద్ధహస్తుడే అనేది ఆయనను ఎరిగినవారు చెప్పేది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా పీజేఆర్ తనయుడిని బయటికి పంపి మరీ జూబ్లీహిల్స్ టికెట్ దక్కించుకున్న ఈ మాజీ క్రికెటర్‌కు అదేరీతిన సమీకరణాలు కుదిరి ఎమ్మెల్సీ టు క్యాబినెట్ కలలు సాకారం కాకపోతాయా! అనే ఆశ కూడా ఉందనేది బహిరంగ రహస్యం. పైగా 'ముఖ్య'నేత మద్దతు పుష్కలంగా ఉండటంతో అధిష్ఠానం జాబితాలో మైనార్టీ కోటాలో సదరు 'ముఖ్య'నేత పావులు కదిపి తనకు బుగ్గకారు ఎక్కించకపోతారా!! అనే చిన్ని ఆశ కూడా ఉందని పార్టీలోని ఆయన సన్నిహితులు ఆశగా విశ్లేషిస్తారు.

☞ ఇక... ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ గురించి ఎంత మాట్లాడకుంటే అంత మంచిదని ఆయన అనుచరులే పెదవి విరుస్తున్నారట! కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కండువా మార్చితే చాలు! అయితే ఎంపీ, కాకపోతే మంత్రి అన్న బంపర్ ఆఫర్ తలుపు తట్టడంతో రాత్రికి రాత్రే కారు దిగి హస్తం ఒడిలో ఒదిగిపోయారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో 'ముఖ్య'నేత పిలిచి మరీ పక్కనే తిప్పుకోవడంతో తన దశ మారిందనుకున్నారు. కానీ ఏదో ఒక సినిమాలో అన్నట్లు... దురదృష్టం బెడ్‌రూంలో దుప్పటి తన్నుకుని పడుకుంటే ఏం చేస్తాం?! అన్నట్లు సికింద్రాబాద్ లోక్‌సభ స్థానంలో ఓటమి వెక్కిరించడమే కాకుండా క్యాబినెట్ కలలు కరిగిపోయాయి. చివరకు నియోజకవర్గంలో అధికారులు సైతం తన మాట వినకపోవడంతో ప్రతిసారీ 'సీఎంతో మాట్లాడతా' అని సర్దుకుపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇంటికి అరిష్టం పట్టిందని గుడిలోని దేవుడ్ని ఎత్తుకెళ్లారు..

వినాయకుడి గుడికి వచ్చిన ఇద్దరు మహిళలు చోరీ

48 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు

వెంగళరావునగర్, మార్చి11: అరిష్టం పట్టిందని గుడిలోని శివపార్వతుల పంచలోహ విగ్రహాలను దొంగిలించి ఇద్దరు మహిళలు ఇంటికి తెచ్చుకున్నారు. ఈ ఘటన ఎస్.ఆర్. నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బంజారాహిల్స్ ఎన్‌బీటీ నగర్‌కు చెందిన స్వర్ణలత(29), తన సోదరి పావని(26) కలిసి ఉంటున్నారు. రెండేండ్లలో స్వర్ణలతో ఇంట్లో వరుసగా తల్లిదండ్రులతో పాటు ఇద్దరు సోదరులు వెంటవెంటనే మరణించారు. దీంతో స్వర్ణలత ఇంటికి కీడు పట్టిందని.. ఇది తొలిగిపోవాలంటే ఆది దేవుళ్లను గుడిలో నుంచి కాజేసి ఇంటికి తెచ్చుకుంటే అరిష్టం తొలిగి సకల శుభాలు కలుగుతాయని భావించింది. ఈ నెల 8న ఎస్.ఆర్.నగర్ సమీపంలోని గురుమూర్తినగర్‌లోని శ్రీ వినాయక టెంపుల్‌కు సోదరితో కలిసి వెళ్లింది. అక్కడ అర్చకుడు నవీన్‌కుమార్ ప్రసాదాలు పంచి పెడుతుండగా ఇదే అదునుగా శివపార్వతుల పంచలోహ విగ్రహాలను కాజేశారు. ఇది గమనించిన అర్చకుడు నవీన్ ఆలయ ఈవో నరేందర్‌రెడ్డికి తెలియజేయగా ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు స్వర్ణలత, పావనీలే చోరీకి పాల్పడినట్లు తేల్చి పంచలోహ విగ్రహాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను ఎస్.ఆర్. నగర్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ పి.వెంకటరమణ, ఎస్.ఆర్.నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి, డీఐ గోపాల్, డీఎస్సై సూరజ్‌తో కలిసి మీడియాకు వెల్లడించారు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

ఓటీఎస్‌కు స్పందన కరువు

ముందుకు రాని ఆస్తి పన్ను బకాయిదారులు

సిటీబ్యూరో, మార్చి 11 (నమస్తే తెలంగాణ): ఆస్తి పన్ను బకాయి ఒకేసారి చెల్లించి 90 శాతం రాయితీ పొందాలని, వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్)ను సద్వినియోగం చేసుకోవాలన్న జీహెచ్ఎంసీ పిలుపునకు బకాయిదారుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రావడం లేదు. ఈ నెల 7న ఓటీఎస్‌కు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. ఆర్థిక సంవత్సరం ఈ నెలాఖరులో ముగుస్తుండటం, నిర్దేశిత లక్ష్యం రూ.2100 కోట్లకు చేరాలంటే ఓటీఎస్‌తో సాధ్యమని అధికారులు అంచనా వేశారు. ఐతే ఓటీఎస్‌ను బకాయిదారులందరూ సద్వినియోగం చేసుకుంటారని, తద్వారా రోజుకు రూ.20కోట్లకు పైగా ఆదాయం వస్తుందని అధికారులు భావించారు. ఈ మేరకు డీసీలు, బిల్ కలెక్టర్లు, కింది స్థాయి అధికారులు ఐదు లక్షలకు పైబడి ఉన్న బకాయిదారులపై స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. అయినప్పటికీ గడిచిన రెండు రోజులు రూ.5 నుంచి 6 కోట్లు మాత్రమే వసూలు అవుతున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఓటీఎస్‌పై ఐటీ విభాగం విస్తృత ప్రచార లేమితో ఆశించిన స్థాయిలో వసూళ్లు రావడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా మంగళవారం నాటి వరకు 12.60 లక్షల మంది నుంచి రూ. 1566 కోట్ల ఆదాయమే సమకూరింది.

నుజ్జునుజైన కారు

అతివేగంతో నడిపి.. స్తంభాన్ని ఢీకొట్టి

రోడ్డు ప్రమాదంలో ఎంజీఐటీ విద్యార్థి దుర్మరణం

మరో ఐదుగురికి తీవ్ర గాయాలు

మణికొండ మార్చి 11: అతివేగంతో వాహనాన్ని నడుపుతూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి ఓ ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. ఈ విషాద ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గండిపేటలోని ఎంజీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఆరుగురు విద్యార్థులు (TS08 BEG4929) స్విఫ్ట్ కారులో మంగళవారం సాయంత్రం కళాశాల నుంచి ఇంటికి బయలు దేరారు. నియోపోలీస్ సమీపంలోకి రాగానే వేగంగా వెళ్లి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న శ్రీకర్ (18) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మిగిలిన ఐదుగురిలో హేమ సాయి(19), వివేక్(19), సృజన(18), కార్తికేయ(18), హర్ష(19)కి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో హర్షసాయి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను స్థానిక వైద్యశాలలో చేర్పించిన పోలీసులు శ్రీకర్ మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



శ్రీకర్ కళాశాల గుర్తింపు కార్డు

హైడ్రా పేరుతో వసూళ్లు

ట్రాక్టర్‌కు రూ.300, టిప్పర్‌కు రూ.500

జగద్గిరిగుట్టలోని హెచ్ఎండీఏ స్థలంలో దందా

మూడు నెలలుగా యథేచ్ఛగా నిర్మాణ వ్యర్థాల పారబోత

నగదు వసూలు చేస్తున్న కాపలాదారుడు

జగద్గిరిగుట్ట: హెచ్ఎండీఏ అభివృద్ధి చేస్తున్న స్థలం కేంద్రంగా హైడ్రా ముసుగులో వసూళ్ల పర్వం జోరుగా సాగుతున్నది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ సమీపంలోని హెచ్ఎంటీ స్థలాన్ని రెండేండ్ల క్రితం హెచ్ఎండీఏ తీసుకుంది. సుమారు 20 ఎకరాలను ప్లాట్లుగా చేసి విక్రయించాలన్నది ప్రణాళిక. అయితే ఏడాది కాలంగా ఎలాంటి పనులు చేపట్టకుండా వదిలివేసిన హెచ్ఎండీఏ కేవలం ఓ వైపు మాత్రమే ఫెన్సింగ్, సరిహద్దు రాళ్లు మాత్రమే ఏర్పాటు చేశారు. ఇదే అక్రమార్కులకు కలిసివస్తున్నది. లోతట్టు ప్రాంతం కావడంతో నెల రోజులుగా బయటి నుంచి తీసుకు వచ్చిన నిర్మాణ వ్యర్థాలను ఇక్కడ పారబోస్తున్నారు. అయితే గతంలో హైడ్రా తొలగించిన నిర్మాణ వ్యర్థాలను ఇక్కడికి తీసుకువచ్చేవారు. ఇదే ఆసరాగా చేసుకున్న అక్రమార్కులు కొందరు జగద్గిరిగుట్ట నుంచి సుమారు 20 కిలోమీటర్ల దూరంలోని ప్రైవేట్ వ్యక్తుల భవన వ్యర్థాలను సైతం ఇక్కడికే తరలిస్తున్నారు. ఈ స్థలం వద్ద ఇద్దరు సిబ్బందిని కాపాలా ఉంచి కొందరు వసూళ్లకు పాల్పడుతున్నారు. అయితే గతంలో హెచ్ఎంటీ ఖాళీ స్థలంలో వ్యర్థాలను పారబోసేవారు. ప్రస్తుతం అధికారిక హెచ్ఎండీఏ లే అవుట్‌లో డంప్ చేస్తున్నారు.

హైడ్రా పేరుతో దందా..

హైడ్రా కూల్చిన భవన వ్యర్థాలను ఇక్కడికి తరలిస్తుండగా కొందరు ప్రైవేట్ వ్యక్తులు సైతం హైడ్రా పేరు చెప్పి ఇక్కడే పారబోస్తున్నారు. ట్రిప్పులకు లెక్కలు కట్టి ట్రాక్టర్‌కు రూ.300, టిప్పర్‌కు రూ.500 వసూలు చేస్తున్నా పట్టించుకున్న నాథుడే లేడు. ఎలాంటి రసీదులు, వాహనాల వివరాలు నమోదు చేయడం లేదు. తాము ఎక్కడో పారబోయాల్సి ఉంటుంది కావున అదేదో ఇక్కడే వేసి డబ్బులు చెల్లిస్తున్నామని వాహన డ్రైవర్లు వాపోతున్నారు. ఇదేమని ఇక్కడి సిబ్బందిని ప్రశ్నిస్తే ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయని.. హెచ్ఎండీఏ లే అవుట్ పనుల కోసం వసూలు చేస్తున్నామని వివరిస్తున్నారు. రోజూ సుమారు 500 వాహనాలు ఇక్కడికి వ్యర్థాలు తరలిస్తుండగా రూ. లక్షలకు పైగా వసూలవుతున్నా నగదు ఎవరికి చేరుతున్నది.. ఇందులో ఎవరెవరి వాటాలు ఎంతెంతో తేలాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మూడు నెలలుగా జరుగుతున్న ఈ దందా వెనుక ఉన్నతాధికారులు ఉన్నారనే విమర్శలు ఉన్నాయి. ఇకనైనా అధికారులు అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోవాల్సి అవసరం ఉంది.

మా దృష్టికి రాలేదు..

హెచ్ఎండీఏ చేస్తున్న హెచ్ఎంటీఏ లే అవుట్‌లో పోస్తున్న భవన నిర్మాణ వ్యర్థాలకు డబ్బులు వసూలు చేస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. అక్కడ ఏం జరుగుతుందో వివరాలు సేకరించి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం. నిర్మాణ వ్యర్థాలకు డబ్బులు వసూలు చేయడం అక్రమమే.

- డీసీ మల్లారెడ్డి

జగద్గిరిగుట్ట సమీపంలోని హెచ్ఎండీఏ స్థలంలో పారబోస్తున్న వ్యర్థాలు

అసెంబ్లీ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో మంగళవారం తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్ఎస్ శాసనసభ పక్ష సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మండలి ప్రతిపక్ష నేత మధుసూధనాచారి, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, మహమూద్ అలీ, తలసాని, పద్మారావు, సబితా ఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, ఎమ్మెల్సీలు కవిత, సురభి వాణీదేవి, నవీన్‌రావు, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద్, సుధీర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, తదితరులు

ట్రాన్స్‌ఫార్మర్ కాలిందా.. అంతేసంగతులు

కరెంట్ సరఫరాలో తీవ్ర సమస్యలు..!

గతేడాది నగరంలోనే ఎక్కువ ఫిర్యాదులు.. విశ్లేషించుకోని అధికారులు

డిమాండ్ పెరుగుతుంటే బ్రేక్‌డౌన్లు.. దక్షిణ డిస్కం తీరు మారేనా

సిటీబ్యూరో, మార్చి 11 (నమస్తే తెలంగాణ): ఈ సంవత్సరం వేసవి కాలంలో గ్రేటర్‌లో విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరుగుతోంది. దీంతో సరఫరాలో తీవ్ర అంతరాయాలు తలెత్తుతున్నాయి. హైదరాబాద్‌లో అత్యధికంగా సరఫరా అయ్యే ఓవర్‌హెడ్ విద్యుత్ తీగల మూలంగా అంతరాయం ఏర్పడుతున్నట్లు సమాచారం. ఎండావానలకు ప్రభావితమవడంతో గత సంవత్సరం అనేక ప్రాంతాల్లో సరఫరాలో సమస్యలు వచ్చాయి. ప్రధానంగా వినియోగదారులు ఫిర్యాదులు చేసినప్పటికీ విశ్లేషించుకోవడంలో టీజీఎస్‌పీడీసీఎల్ విఫలమవుతోంది. సాధారణంగా ఈ సమస్యలు తలెత్తినప్పుడు ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా సమస్యలు వచ్చాయి. ఈ సారి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు ఎలా చేపట్టాలో క్షేత్రస్థాయిలో అధికారులతో సమీక్షలు జరిగినప్పటికీ ఇప్పటివరకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ పూర్తి కాకపోవడం.. గత సంవత్సరం వలే సమస్యల తీవ్రత మార్చిలోనే పెరుగుతుండడంతో ఇంజినీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండాకాలం, వర్షాకాలంలో సమస్యలు ఎక్కువగా వస్తున్నందున ఈ ఆరు నెలలను పరిగణనలోకి తీసుకుంటారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు వచ్చిన ఫిర్యాదులతో ప్రతీయేడాది ప్రణాళిక రూపొందిస్తారు. కానీ ఈసారి అలా చేసినప్పటికీ యాక్షన్ ప్లాన్ అమలులో మాత్రం పనులన్నీ నత్తనడకన సాగుతున్నాయి.

అధికంగా ఫిర్యాదులు అక్కడే!

హైదరాబాద్ పరిధిలో పది సర్కిళ్లు ఉన్నాయి. గత సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు వచ్చిన ఫిర్యాదులు చూస్తే హైదరాబాద్‌లోనే ఎక్కువగా సరఫరా లోపాలు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. హైదరాబాద్ సెంట్రల్‌లో అత్యధికంగా 1.54 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. సికింద్రాబాద్ నుంచి 30,596, మేడ్చల్ నుంచి 24,296, హైదరాబాద్ సౌత్ నుంచి 21,652, బంజారాహిల్స్ పరిధిలో 17,581, సైబర్‌సిటీ నుంచి 15,864 మంది ఫిర్యాదులు చేశారు. వీటిలో ట్రాన్స్‌ఫార్మర్లు పాడవడం, ఫ్యూజులు పోవడం, ఎల్‌టీ లైన్, సర్వీస్ వైర్ లోపాలకు సంబంధించినవే ఉన్నాయి. గత సంవత్సరం సంగారెడ్డి పరిధిలో అత్యధికంగా 169, బంజారాహిల్స్,సికింద్రాబాద్ సర్కిళ్ల పరిధిలో 97, హబ్సిగూడలో 65 బ్రేక్‌డౌన్స్ వచ్చాయి. ఈ సారి ఈ ప్రాంతాలపై దృష్టి పెట్టినప్పటికీ కొన్నిచోట్ల పెరిగిన డిమాండ్ కారణంగా లోడ్ పెరుగుతోంది. మరోవైపు ఫ్యూజ్ ఆఫ్ కాల్ సిబ్బంది నిర్లక్ష్యం దక్షిణ డిస్కంకు తలనొప్పిగా మారింది.రెండువారాల నుంచి వస్తున్న ఫిర్యాదులను చూస్తే సిబ్బంది పట్టించుకోవడం లేదని, ఫోన్‌చేస్తే కలవడం లేదన్న ఫిర్యాదులే ఉన్నాయి.

డిస్కంలలో ట్రాన్స్‌ఫార్మర్ల కొరత..

సమ్మర్‌లో వినియోగదారులు ప్రధానంగా ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోవడం ద్వారా ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటారు. డిస్కంలో ఈ సారి ట్రాన్స్‌ఫార్మర్ల కొరత విపరీతంగా ఉందని వినియోగదారులు, కాంట్రాక్టర్లు చెబుతున్నారు. తాము కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటూ డీడీలు కట్టినప్పటికీ ఆర్డర్ ప్రకారం ఆరువందల నంబర్ నడుస్తున్నదని.. గత సంవత్సరం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో 886 డీటీఆర్‌లు చెడిపోగా.. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తులకు సగటున 8 గంటల 42 నిమిషాల సమయం పట్టినట్లుగా గణాంకాలు చెబుతున్నాయి. ఈ సమస్యపై ఇప్పటివరకు దక్షిణ డిస్కంలో పరిష్కారం కనిపించడం లేదు. ఒకవైపు స్టోర్స్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల కొరత, మరోవైపు మరమ్మతులకు గంటల కొద్దీ టైం కారణంగా వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. నగరంలోనే కాకుండా దక్షిణ డిస్కం పరిధిలో ఉన్న చాలా ప్రాంతాల నుంచి ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా ఉంటున్నాయి. అయితే స్టోర్స్‌లో మొత్తం సామగ్రి ఉందంటూ అధికారులు చెబుతున్నా.. వాళ్ల ఆఫీసుల్లో గోడలపై ఎంతెంత సామగ్రి స్టాక్ ఉందో బోర్డులపై రాసుకున్నా.. స్టోర్లలో మాత్రం ఆ పరిస్థితి లేదని వినియోగదారులు చెబుతున్నారు.